సాక్షి
పెద్దపల్లి
బుధవారం । 12 । ఏప్రిల్ । 2023



దళితబంధు ఇవ్వరా?

అర్హులైన దళితులకు దళితబంధు పథకం వర్తించదా అని పీసీసీ ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రశ్నించారు.
8లో▸



నామమాత్రంగా గ్రామసభలు

గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామసభల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది.
8లో▸

గరిష్టం/కనిష్టం
39.0/26.0

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. పగటిపూట ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

ఆకలి గొన్న వానికి కడుపు నింపడం అత్యుత్తమ దానం
– మహమ్మద్ ప్రవక్త

	ఇఫ్తార్		సహర్
బుధ	6:35	గురు	4:35

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

రెవెన్యూ ఉద్యోగులకు యూనిఫాం పంపిణీ


యూనిఫాంలు అందిస్తున్న కలెక్టర్ సంగీత

సుల్తానాబాద్: రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న నాల్గో తరగతి ఉద్యోగులు, డ్రైవర్లకు యూనిఫాంలను కలెక్టర్ సంగీత కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం అందించారు. మొత్తం 44 మందికి రెండు జతలు చొప్పున ప్రభుత్వ పరంగా యూనిఫాం కుట్టించి అందించామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్ దీపక్, కలెక్టరేట్ ఏవో కేవై.ప్రసాద్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి


కంటివెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబిహ

సుల్తానాబాద్: అర్హులందరూ కంటివెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని రాష్ట్ర క్వాలిటీ కంట్రోలర్ అధికారి డాక్టర్ సబిహ అన్నారు. పట్టణంలోని పూసాల ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న కంటివెలుగు వైద్య శిబిరాన్ని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. అర్హులకు ఉచితంగా అద్దాలు పంపిణీ చేయాలని, దూరదృష్టి లోపం ఉన్న వారికీ ఆర్డర్ ఇచ్చి తెప్పించాలన్నారు. డాక్టర్ శ్రీజాను స్థానిక పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. హెచ్ఈఓ శ్రీనివాసరెడ్డి, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణకు చర్యలు


నియంత్రణ చర్యలను పరిశీలిస్తున్న శ్రీనివాస్

జ్యోతినగర్: అగ్ని ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, పెద్దపల్లి అగ్నిమాపక అధికారి దేవనంది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఓ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో అగ్నిమాపక సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ప్రమాదాల నియంత్రణ జాగ్రత్తలను పరిశీలించారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆసుపత్రులు, పాఠశాలలు, వాణిజ్య సంస్థల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అగ్ని మాపక సిబ్బంది సిరాజుద్దిన్, శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, నరేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షకు 7,925 మంది హాజరు

జ్యోతినగర్: మంగళవారం నిర్వహించిన పదో తరగతి సాంఘికశాస్త్ర పరీక్షకు 7,925 మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈఓ డి.మాధవి తెలిపారు. 7937 విద్యార్థులకు 7925 మంది హాజరై 99.8శాతంగా నమోదైనట్లు పేర్కొన్నారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 17 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారని పేర్కొన్నారు.

జడలు విప్పుతున్న అవినీతి..!

ఏసీబీకి చిక్కుతున్నా.. ఆగని వసూళ్ల పర్వం

- ప్రభుత్వ శాఖల్లో పెచ్చుమీరుతున్న వ్యవహారం
- కీలక శాఖల్లో పైసా ఇవ్వనిదే పనికాని వైనం
- తాజాగా ఏసీబీకి చిక్కిన సబ్‌రిజిస్ట్రార్ నిర్మల
- చదువులో నంబర్ వన్ అయినా మారని వక్రబుద్ధి


పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ నిర్మల


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారణ చేపడుతున్న ఏసీబీ అధికారులు

ఇటీవల లంచం తీసుకుంటూ పట్టుబడిన వారు

- 2019మార్చిలో పెద్దపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో భూదస్తావేజులు ఇచ్చేందుకు రూ.30వేలు లంచంతీసుకుంటూ సబ్‌రిజిస్ట్రార్, డాక్యుమెంట్‌రైటర్ పట్టుపడ్డారు.
- 2022 ఆగస్టు 27న కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్ భూ రిజిస్ట్రేషన్ కోసం రూ.7,500 లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు.
- 2022 మే 23న అంతర్గాం పరిధిలో హద్దుల ఏర్పాటుకు సర్వేచేయాలని బాధితుడు అధికారులను సంప్రదించగా మూడు లక్షలు డిమాండ్ చేసి.. మొదట విడత రూ.లక్ష తీసుకుంటూ తహసీల్దార్, ఆర్ఐ, ఓ ప్రైవేట్ ఉద్యోగి పట్టుబడ్డారు.
- 2021 నవంబర్ 30న పెద్దపల్లి ఆర్డీవో, రామగుండం కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ ఓ కాంట్రాక్టర్ బిల్లుల మంజూరు కోసం రూ.లక్ష తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.
- 2021 నవంబర్ 6న మంథనిలో ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకున్న ఓ రైతు నుంచి రూ.20వేలు తీసుకుంటూ ఏఈ రాజ్‌కుమార్ దొరికాడు.
- 2021 సెప్టెంబర్ 4న సీపీవో వెంకటనారాయణ ఓ కాంట్రాక్టర్ పనుల బిల్లు మంజూరుకు రూ.40వేలు లంచం తీసుకుంటూ చిక్కాడు.
- తాజాగా పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ నిర్మల తన కార్యాలయంలో అటెండర్ ద్వారా ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి నుంచి రూ.60వేలు తీసుకుంటూ పట్టుబడింది. ఇలా వరుసగా పట్టుబడుతుండడం అధికారుల్లో అవినీతి ఏ స్థాయిలో వేళ్లూనుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు.

సాక్షి, పెద్దపల్లి: రెవెన్యూ, మున్సిపల్, సీపీవో, విద్యుత్.. ఇలా శాఖల వారీగా జిల్లాలో లంచం తీసుకుంటూ ప్రభుత్వ ఉద్యోగులు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)కు చిక్కుతున్నా అవినీతికి మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. ఏసీబీ దాడులకు వెరవకుండా తమ అవినీతిని కొనసాగిస్తున్నారు. ప్రతి చిన్నదానికీ లంచం ఇవ్వనిదే పని జరగడం లేదు. తాజాగా మంగళవారం పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ నిర్మల ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి నుంచి రూ.60వేలు లంచంగా తీసుకుంటూ పట్టుపడటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో కొన్ని ప్రధాన శాఖల్లో విచ్చలవిడిగా అవినీతి రాజ్యమేలుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో బాధితులు ఏసీబీని ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

రెవెన్యూ, సర్వే విభాగాల్లోనే అధికం..

కీలక రెవెన్యూ శాఖలో అవినీతి వరదలా పారుతోంది. కులం, ఆదాయం మొదలు పహాణీ, పట్టా మార్పిడి, పట్టాదారు పాస్ పుస్తకాలు, భూములు, ఇళ్ల స్థలాలు, సరిహద్దు సమస్యలు, సర్వేల కోసం కింది స్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారుల వరకు వేర్వేరుగా వ్యవహారాలను చక్కబెట్టాల్సిందే.

- భూమి కొలత చేయాలంటే మీసేవలో రూ.265 చెల్లిస్తే సరిపోతుంది. ఇలా చెల్లించిన వారు ఏళ్ల తరబడి భూముల కొలతకు నోచుకోలేకపోతున్నారు. ఎకరాకు భూమి విలువ, సమస్య తీవ్రతను బట్టి రూ.2వేల నుంచి రూ.లక్ష వరకు సర్వేయర్లు లంచంగా పుచ్చుకుంటున్నారు. సర్వేయర్ల కొరత ఉండటంతో వీరికి డిమాండ్ బాగా పెరిగింది. ఒక్కో సర్వేయర్ రెండు నుంచి మూడు మండలాలకు ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు.
- సొంతింటి కలను నిజం చేసుకునేందుకు రెక్కలు ముక్కలు చేసుకొని కాపాడుకున్న భూమి అయినా.. ఇళ్లు అయినా రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే కార్యాలయంలో సిబ్బందితో సహా డాక్యుమెంట్ రైటర్స్‌కు డబ్బులు ముట్టజెప్పాల్సి వస్తోంది. ధరణి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా.. సదరు ధరణి ఆపరేటర్ల ద్వారా అవినీతి జోరుగా సాగుతోంది.
- కొత్త వాహనాన్ని కొన్నా.. పాత వాహనాన్ని విక్రయించినా.. లైసెన్సు పొందాలన్నా కచ్చితంగా ఆర్టీఏ అధికారుల జేబు నింపాల్సి వస్తోందని బాధితులు అంటున్నారు. జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఏజెంట్లు అవినీతిలో భాగస్వాములు అవుతున్నారు. చార్జీల కంటే నాలుగు రెట్లు ఎక్కువగా వసూలు చేస్తున్నారు. బిల్లుల కోసం వచ్చిన వారి దగ్గర పర్సెంటేజీలు తీసుకోనిదే ట్రెజరీ కార్యాలయంలో బిల్లు చేయటం లేదంటే అతిశయోక్తికాదు.
- బల్దియాల్లో ఇళ్ల పర్మిషన్, ఆస్తి, పేరు మార్పిడి, ట్రేడ్ లైసెన్స్‌ల మంజూరు, గడువు పొడిగింపు తదిరత సేవలకు సిబ్బందికి అమ్యామ్యాలు ఇవ్వాల్సిందే. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, నీటి పారుదలశాఖ తదితర ఇంజినీరింగ్ విభాగాల్లో పర్సంటేజీల బాగోతం కొనసాగడం బహిరంగ రహస్యమేనని ప్రజలు బాహాటంగా చర్చించుకుంటున్నారు. ఎక్సైజ్‌శాఖలో బెల్ట్‌షాపులు, బార్లు, వైన్స్‌షాపులకు సంబంధించి అధికారులకు ప్రతినెలా మామూళ్లు చెల్లించాల్సిందే. ఇలా ప్రధాన శాఖల్లో జోరుగా అవినీతి రాజ్యమేలుతోంది.

చదువులో మేటి.. అయినా వక్రబుద్ధి

లంచం తీసుకుంటూ పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ నిర్మల గతంలో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. మొదటగా వీఆర్వోగా ఎంపికైంది. తర్వాత పంచాయతీ కార్యదర్శిగాను ఎంపికైంది. అనంతరం సింగరేణిలోనూ జాబ్ కొట్టింది. చివరగా గ్రూప్–2లో మహిళల్లోనే స్టేట్ ఫస్ట్ ర్యాంకర్. ఇలా చదువులో మెరిట్‌గా ఉంటూ.. సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ.. రూ.లక్షల్లో వేతనం పొందుతున్నా ఆమె తన వక్రబుద్ధిని మార్చుకోలేకపోయింది. తాజాగా రూ.60 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారింది.

ఏసీబీకి చిక్కిన పెద్దపల్లి సబ్‌రిజిస్ట్రార్

- ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం లంచం
- అటెండర్ ద్వారా రూ.60వేలు తీసుకుంటూ పట్టుబడిన వైనం


వివరాలు తెలుపుతున్న ఏసీబీ డీఎస్పీ భద్రయ్య

సాక్షి, పెద్దపల్లి: ఓ భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కింది పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ దేవగిరి నిర్మల. ఏసీబీ డీఎస్పీ భద్రయ్య కథనం ప్రకారం.. పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రాఘవపూర్‌లోని ఓ భూమి రిజిస్ట్రేషన్ కోసం పూదరి శ్రీనివాస్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి సబ్‌రిజిస్ట్రార్‌ను సంప్రదించగా.. డాక్యుమెంట్ రైటర్ అనుదీప్‌తో మొదట డబ్బులు డిమాండ్ చేసింది. రియల్టర్ డబ్బులు ఇవ్వకపోవడంతో రిజిస్ట్రేషన్ చేసిన వారంపాటు నంబర్ కేటాయించకుండా పెండింగ్‌లో పెట్టింది. దీంతో సదరు రియల్టర్ ఆ భూమిని ఆరుగురికి పార్టీషన్ డీడ్ చేసేందుకు మరోసారి సబ్‌రిజిస్ట్రార్‌ను సంప్రదించాడు. ఇద్దరు సొంత కొడుకులను మినహాయించి, మిగిలిన నాలుగు పార్టీషన్ డీడీలకు ఒక్కో డీడీకి రూ.15వేల చొప్పున లంచం డిమాండ్ చేసింది. దీంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. పక్కా ప్లాన్‌తో మంగళవారం ఆఫీస్ అటెండర్ సుద్దాల శ్రీనివాస్ ద్వారా రూ.60వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నామని డీఎస్పీ తెలిపారు.

అవినీతి అధికారుల సమాచారం ఇవ్వండి

అవినీతి అధికారుల వివరాలు ఏసీబీకి నేరుగాగానీ లేదా ట్రోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి తెలపవచ్చు. జిల్లాలో కొందరు లంచం తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. బాధితులు ముందుకొచ్చి అవినీతిపై సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. – భద్రయ్య, ఏసీబీ డీఎస్పీ

జ్యోతిబాపూలే ఆదర్శనీయుడు

- కుల వివక్ష నిర్మూలనతో నవ సమాజం నిర్మాణం
- పూలే స్ఫూర్తితో మెరుగైన విద్య
- జయంతి సభలో కలెక్టర్ సంగీత


కలెక్టరేట్‌లో నివాళి అర్పిస్తున్న కలెక్టర్ సంగీత, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు




మంథనిలో పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు, గోదావరిఖనిలో రాజ్‌ఠాగూర్, మంథనిలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు..

జ్యోతినగర్: మహాత్మ జ్యోతిబాపూలే నేటి సమాజానికి ఆదర్శనీయుడని కలెక్టర్ సంగీత కొనియాడారు. కలెక్టరేట్‌లో పూలే 197వ జయంతిని నిర్వహించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, అదనపు కలెక్టర్లు వి.లక్ష్మీనారాయణ, కుమార్ దీపక్‌తో కలిసి నివాళులు అర్పించారు. మహనీయుల స్ఫూర్తిని చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం వారి జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. బాలికలకు విద్య కోసం పూలే దంపతులు చిత్తశుద్ధితో పనిచేశారని పేర్కొన్నారు. మన ఊరు– మన బడి కార్యక్రమంతో పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన ప్రారంభించామన్నారు. దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ స్త్రీలకు విద్యను అందించిన మహనీయుడని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, జెడ్పీటీసీలు కందుల సంధ్యారాణి, లక్ష్మణ్, గంటా రాములు, బీఎస్పీ పెద్దపల్లి ఇన్‌చార్జి దాసరి ఉష, టీజీఓ అధ్యక్షుడు, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ తూము రవీందర్, టీఎన్జీవో అధ్యక్షుడు బొంకూరి శంకర్, బీసీ అభివృద్ధి శాఖ అధికారి రంగారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ నాయకులు ఆకుల స్వామి, వివేక్ పటేల్, నాయకులు రాజేందర్ నేత, సదానందం నేత పాల్గొన్నారు.

దేశానికి వన్నెతెచ్చిన మహనీయుడు

మంథని: దేశానికి వన్నెతెచ్చిన మహనీయుడు జ్యోతిబాపూలే అని మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళి అర్పించారు. మంథనిలోని పూలే విగ్రహానికి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, బీఆర్ఎస్ నాయకులు నివాళిఅర్పించారు. బీజేపీ నాయకులు నివాళి అర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సెగ్గెం రాజేష్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ శశిభూషణ్ కాచేఉన్నారు.

మక్కాన్‌సింగ్ నివాళి

గోదావరిఖని: పూలే జయంతిని స్థానిక దుర్గానగర్‌లోని ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌ఠాగూర్ నివాళ్లర్పించారు. కార్యక్రమంలో బొంతల రాజేష్, మహంకాళి స్వామి, గాదెం విజయ, పెద్దెల్లి ప్రకాశ్ పాల్గొన్నారు.

ఆరెందలో నీటిపారుదల ఏఈఈ నిర్బంధం


నిర్బంధంలో ఉన్న ఏఈఈ వెంకన్న


నిరసన తెలుపుతున్న రైతులు

- సర్వే పేరిట కాలయాపన చేస్తారా..? అని ఆగ్రహం

మంథని: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్నారం బ్యారేజీ బ్యాక్‌వాటర్‌తో ముంపునకు గురవుతున్న పంటల పరిశీలనకు వచ్చిన అధికారులను మండలంలోని ఆరెంద, మల్లారం రైతులు అడ్డుకున్నారు. గోదావరి తీరంలోని మంథని మండలం ఆరెంద, మల్లారం శివారులో ముంపునకు గురౌతున్న పంటలను నీటి పారుదల శాఖ ఏఈఈ గుగులోతు వెంకన్న, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ త్రివేణి మంగళవారం ఆరెందకు వచ్చారు. పంటలను పరిశీలించి సర్వే చేస్తున్న వారిని రైతులు అధికారులను నిలదీశారు. సర్వే పేరుతో కాలయాపన చేస్తున్నారని, ఇప్పటికే ఎనిమిది పంటలు నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఈఈ వెంకన్నను గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. నెలక్రితం ధర్నా నిర్వహించగా సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన అధికారులు మళ్లీ సర్వేకు ఎందుకొచ్చారని ప్రశ్నించారు. మంథని ఎస్సై వెంకటేశ్వర్లు చేరుకొని రైతులతో మాట్లాడారు. అధికారుల హామీతో ఏఈఈని వదిలిపెట్టారు.

కమ్యూనిటీ భవనాలకు ఎన్టీపీసీ చేయూత

రామగుండం: కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి సహకరిస్తున్న ఎన్టీపీసీ యాజమాన్యానికి రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కృతజ్ఞతలు తెలిపారు. అక్బర్‌నగర్‌లోని కమ్యూనిటీ భవనాన్ని ఎన్టీపీసీ ఈడీ సునీల్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఎన్టీపీసీ ప్రభావిత గ్రామాల్లో సీఎస్ఆర్ నిధులతో సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఎన్టీపీసీ బూడిద చెరువుతో అక్బర్‌నగర్, కుందనపల్లి ప్రజలకు సమస్య ఉందని, ఆ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కాలుష్య సమస్యతో ప్రజలు వ్యాధులకు గురవుతున్నారని, బాధితులకు కార్పొరేట్ వైద్యం అందించాలని కోరారు. ఎన్టీపీసీ సీజీఎం ప్రసంజిత్‌పాల్, జీఎంలు బిజోయ్‌కుమార్ సిక్దర్, ఐఎన్టీయూసీ జాతీయ ప్రతినిధి బాబర్‌సలీంపాషా, జెడ్పీటీసీ ఆముల నారాయణ తదితరులు పాల్గొన్నారు.


కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చందర్

ఇంటికి పోదాం చలోచలో..






పది పరీక్షలు ముగియడంతో పిల్లలు హమ్మయ్యా అని ఊపిరిపీల్చుకున్నారు. ఇక తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకెళ్లేందుకు ఆయా హాస్టళ్లకు చేరుకున్నారు. ట్రంక్‌పెట్టెలు, సామగ్రితో ఇళ్లకు పయనమయ్యారు. స్నేహితులు, ఉపాధ్యాయులకు చివరిసారిగా బైబై చెబుతూ ఇంటిముఖం పట్టారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



క్లుప్తంగా

అందాల పోటీల విజేతకు మెరుగులు దిద్దిన రష్మీ ఠాగూర్


విజేత అంకితా ఠాగూర్‌తో రష్మీ ఠాగూర్

జ్యోతినగర్: కేరళ రాష్ట్రం కొచ్చిలోని లీ–మెరిడీయన్‌లో జరిగిన మిసెస్ ఇండియా అందాల పోటీల్లో విజేతగా నిలిచి రెండు అవార్డులు అందుకున్న అంకితా ఠాగూర్‌కు పోటీల్లో పాల్గొనేందుకు మెరుగులు దిద్దిన ఎన్టీపీసీ రామగుండంకు చెందిన రష్మీ ఠాగూర్ రామగుండం ప్రాంతం నుంచి అందాల పోటీలో పాల్గొని పలు జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొని అవార్డులు పొందింది. అంకితా ఠాగూర్‌కు 14 రాష్ట్రాలకు చెందినవారు పోటీలలో పాల్గొన్న క్రమంలో తెలంగాణ నుంచి ప్రాతినిథ్యం వహించి మిసెస్ సౌత్ ఇండియాతో పాటు, బ్యూటీఫుల్ పర్సనాలిటీ అవార్డులు సొంతం చేసుకుంది. రెండు అవార్డులు సాధించడంపై రష్మీ ఠాగూర్ అంకితా ఠాగూర్‌కు అభినందనలు తెలియజేశారు.

ధర్మారంలో బెల్లంపానకం ధ్వంసం


బెల్లంపానకం ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

మంథని: మంథని మండలం ధర్మారం గ్రామంలో నాటుసారా తయారీస్థావరంపై మంగళవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. గ్రామ శివారులో నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై సాయిరాం ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. నాలుగు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ గురువయ్య తెలిపారు. నాటుసారా తయారీకి ఉపయోగించే 100లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు సీఐ పేర్కొన్నారు. గ్రామానికి చెందిన పిడుగు సమ్మయ్య కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సిబ్బంది రాజేందర్, శ్రీనివాస్, సతీష్, నిరంజన్‌లు పాల్గొన్నారు.

మల్యాలలో కరెంట్ మోటార్లు చోరీ

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల గ్రామంలో సోమవారం రాత్రి కరెంట్ మోటార్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు మంగళవారం కాల్వశ్రీరాంపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బసవత్తుల మల్లేశం, రామయ్యలకు చెందిన కరెంట్ మోటార్లు చోరీకి గురయ్యాయి. బాధితరైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

నామమాత్రంగా గ్రామసభలు

- కనిపించని ప్రజల భాగస్వామ్యం
- అవగాహన కల్పించని అధికారులు


ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌లో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు (ఫైల్)

ఎలిగేడు: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామసభల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. కానీ క్షేత్రస్థాయిలో ప్రజల భాగస్వామ్యం లేక గ్రామాలు అభివృద్ధి చెందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతోనే నామమాత్రంగా గ్రామసభలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నాయి గ్రామపంచాయతీల అభివృద్ధిలో గ్రామసభల నిర్వహణ ఎంతో కీలకం. ఆయాశాఖల అధికారులతోపాటు పంచాయతీ పాలకవర్గం సభ్యులు, ప్రజలు గ్రామసభల్లో పాల్గొని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం చర్చిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు, లబ్ధిదారుల వివరాల నమోదు గ్రామసభల ద్వారా నిర్వహిస్తారు. ప్రభుత్వాలు చేపట్టే కొత్త పథకాలు, పనులపై ప్రజల అభిప్రాయాలు ఈ సభల ద్వారానే తెలుస్తాయి. ఇంత ప్రాధాన్యం ఉన్న గ్రామసభలు జిల్లాలో నామమాత్రంగానే సాగడం విశేషం.

గ్రామసభల నిర్వహణ ఇలా

గ్రామపంచాయతీల్లో ప్రతీరెండు నెలలకోసారి గ్రామసభలను నిర్వహించాలి. పంచాయతీతో పాటు అనుబంధ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించే తేదీని సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో టాంటాం(దండోరా) వేయించాలి. నిబంధనల ప్రకారం విధిగా 17శాఖల అధికారులు, జనాభాలో సుమారు 20శాతం మంది ప్రజలు గ్రామసభకు హాజరు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం 50మందితో గ్రామసభను ఏర్పాటు చేసేకోవాలని నిబంధనలు ఉన్న తూతూ మంత్రంగా గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నారు. పంచాయతీ ఆదాయ, వ్యయాల పైన కార్యదర్శులు నివేదికలు చదివి వినిపించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఆసక్తి చూపని గ్రామస్తులు

జిల్లాలోని చాలా గ్రామాల్లో నిర్వహించే గ్రామసభలకు కనీసం పది నుంచి ఇరవైమంది కూడా రావడంలేదు. ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీటీచర్లు, వీవోఏలు, వైద్యసిబ్బంది మాత్రమే వస్తున్నారు. పంచాయతీల అభివృద్ధి విషయంలో ప్రజలకు, నాయకులకు మధ్య అంతగా సమాచారం ఉండటంలేదు. గ్రామభల్లో చర్చిస్తున్న సమస్యలకు పరిష్కారం చూపితే గ్రామసభలకు ఆదరణ పెరిగే అవకాశం ఉంది. సమస్యలు పేరుకపోవడంతో సభలకు ఆదరణ తగ్గుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యం పెరగాలి



గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యం మరింతగా పెరగాలి. సభల నిర్వహణపై కార్యదర్శులతో గ్రామాల్లో టాంటాం(దండోరా) వేయిస్తున్నాం. సమాచారం తెలుసుకుని ప్రజలు స్వచ్ఛందంగా సభలకు రావాలి. తద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వీలుంటుంది.

– అనిల్‌రెడ్డి, ఎంపీవో ఎలిగేడు

సత్యాగ్రహ దీక్ష సభను విజయవంతం చేయాలి

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్


మాట్లాడుతున్న ఎంఎస్ రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగే సత్యాగ్రహ దీక్ష సభకు జిల్లానుంచి పెద్దసంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్‌రాజ్‌ఠాగూర్ కోరారు. మంగళవారం స్థానిక దుర్గానగర్‌లోని ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల14న కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగే భారీ బహిరంగసభకు రాబోతున్నారన్నారు. సభకు భారీ ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు హాజరు కావాలని కోరారు. రాష్ట్ర ప్రధాన నాయకులు, మధిర ఎమ్మెల్యే బట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర పెద్దపల్లి జిల్లాలో కొనసాగనున్న క్రమంలో ఆయనకు ఘన స్వాగతం పలకాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై ఉందన్నారు. సమావేశంలో నాయకులు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ముస్తాఫా, విజయతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యాగ్రహదీక్షను విజయవంతం చేయండి

మంథని: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గే ఈ నెల 14న మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగే సత్యాగ్రహ దీక్షకు వస్తున్న సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. మంగళవారం మంథనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. భారతీయ జనతా పార్టీ రాజ్యాంగ వ్యవస్థలను ఉపయోగించుకుని ప్రతి పక్షాలు లేకుండా చేస్తుందన్నారు. రాజ్యాంగంలోని ప్రతి అంశాన్ని కాపాడాలనే సత్యాగ్రహ దీక్ష చేస్తున్నట్లు చెప్పారు.

ఆరోగ్య మహిళకు విశేష స్పందన


మహిళలకు కౌన్సిలింగ్ ఇస్తున్న డాక్టర్ మాధురి


యూపీహెచ్‌సీ ఎదుట మహిళల క్యూలైన్

రామగుండం: రామగుండం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గద్దలపల్లి పీహెచ్‌సీ, జిల్లా కేంద్రంలోని యూపీహెచ్‌సీలను ఆరోగ్య మహిళా కేంద్రాలుగా ప్రభుత్వం గుర్తించింది. ప్రతీ మంగళవారం ఔట్ పేషెంట్ల సంఖ్య పెరుగుతుంది. మంగళవారం 73 మంది ఔట్ పేషెంట్లు వైద్య సేవలు పొందారు. ఇందులో ఇద్దరు మహిళలను మెరుగైన వైద్య సేవల నిమిత్తం జిల్లా కేంద్రానికి రెఫర్ చేయగా, ఏడుగురు మహిళలకు పలుమార్లు వైద్య సేవలు పొందాల్సి ఉందని నిర్ణయించి అందరికీ ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య సమస్యలపై యూపీహెచ్‌సీ డాక్టర్ మాధురి కౌన్సిలింగ్ నిర్వహించి జాగ్రత్తలు తెలియపరిచారు.

రాష్ట్రపతి ప్రశంసలు


పరికరాన్ని పరిశీలిస్తున్న రాష్ట్రపతి

సుల్తానాబాద్: సైన్స్ ద్వారా అనేక అద్భుతాలు సృష్టించవచ్చునని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి అన్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన సాంకేతిక సదస్సులో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌ను రాష్ట్రపతి ద్రౌపదిముర్ము సందర్శించి అభినందించారు. స్థానిక అల్ఫోర్స్ స్కూల్ విద్యార్థిని ఎం.పూజశ్రీ స్కూల్ బస్సుకు ఆక్సిల్ కెమెరా నమూనాను అత్యుత్తమంగా ప్రదర్శింపజేసి మన్ననలను పొందడమే కాకుండా అత్యంత విలువైన జీవితాలను కాపాడే ఒక గొప్ప ఆలోచన అని అభివర్ణించారు.

బొగ్గుబాయి వార్తలు

ప్రధాని మోదీకి గుణపాఠం చెప్పాలి


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న వెంకట్రావ్

రామగిరి(మంథని): బొగ్గు గనుల బ్లాక్‌లను ప్రయివేటీకరణ చేయడాన్ని కార్మికులు వ్యతిరేకిస్తూ మోదీకి తగిన గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్సీ వెంకట్రావ్ అన్నారు. ఆర్జీ–3 పరిధిలోని ఏఎల్‌పీ, ఏపీఏ గనులపై మంగళవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. వెంకట్రావ్ మాట్లాడుతూ సిరులిచ్చే సింగరేణి బొగ్గు గనులను వేలంవేస్తూ ప్రయివేటు రాబందుల పాలుచేసే ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు. కార్మికుల సంక్షేమ కోసం టీబీజీకేఎస్ యూనియన్ ద్వారా ఎన్నో విజయాలు సాధించామని అన్నారు. 190/240 మస్టర్లు పూర్తి చేసిన కార్మికులకు జనరల్ మజ్దూర్‌గా ప్రమోషన్ ఇవ్వడం జరిగిందని, ఇంటి నిర్మాణం కోసం రూ.10లక్షల బ్యాంక్‌లోన్, కార్పొరేట్ వైద్యంతో అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చామని అన్నారు. ఆర్జీ–3 టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, దేవ శ్రీనివాస్, జక్కుల దామోదర్, కోడూరి రాజయ్య, పెద్ది సమ్మయ్య, రవి శంకర్, వీ.వీ గౌడ్, కనుకయ్య పాల్గొన్నారు.

సింగరేణిలో బీసీల విప్లవం రావాలి

- జిల్లా అధ్యక్షుడు శ్రీమన్నారాయణ


గనిపై నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని: మహాత్మ జ్యోతిరావుపూలే ఆశయ సాధనలో సింగరేణి బొగ్గు గనుల్లో బీసీల విప్లవం రానుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు తాడూరు శ్రీమన్నారాయణ అన్నారు. మంగళవారం జీడీకే–2 వగనిపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి కారుపాకల సరోజ, గని ఏజెంట్ చిలుక శ్రీనివాస్, ఏజీఎం పంజాల శ్రీనివాస్, కోళ్ల మల్లేశం, యాదగిరి సత్తయ్య, ఈదునేరు శ్రీనివాస్, మధు, కారుపాకల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్


మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌జయంతి ఉత్సవాలను సింగరేణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని మీటింగ్‌హాల్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక కూరగాయల మార్కెట్ వద్దగల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. జీఎం కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరణ జరుగుతుందన్నారు. సమావేశంలో ఎస్ఓటూ జీఎం రాంమోహన్, డీజీఎం పర్సనల్ లక్ష్మినారాయణ, సింగరేణి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు జనగామ నర్సయ్య, క్రిష్ణయ్య, రాజశేఖర్, లైజన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న జీఎం వెంకటేశ్వర రావు

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలోని సెంటినరీకాలనీలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆంబేడ్కర్ జయంతి వేడుకలను ఈనెల 14న ఘనంగా నిర్వహించాలని ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. సెంటినరీకాలనీలోని రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఎస్సీ అసోసియేషన్ సెక్రటరీ ఏ.నాగేశ్వరరావు, ఎస్టీ అసోసియేషన్ నాయకులు బానోత్ కర్ణ, ఎస్ఓటూ జీఎం రఘుపతి, ఏజీఎం భైద్య, డీజీఎం పర్సనల్ విలాస్ శ్రీనివాస్ పోద్దార్, సీనియర్ సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణ, సివిల్ ఎస్ఈ పద్మరాజు, ఎస్సీ లైజన్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, ఎస్టీ లైజన్ ఆఫీసర్ యల్. వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు దళితబంధు ఇవ్వరా?

- పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు


మాట్లాడుతున్న విజయ రమణారావు

సుల్తానాబాద్: అర్హులైన దళితులకు దళితబంధు పథకం వర్తించదా అని పీసీసీ ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రశ్నించారు. మంగళవారం పెద్దపల్లి మండలం కొత్తపల్లిలో హథ్ సే హథ్ జోడో కార్యక్రమంలో భాగంగా గడపగడపకు కాంగ్రెస్ పార్టీ అనే నినాదంతో పాదయాత్ర చేపట్టారు. టీఆర్ఎస్ కార్యకర్తలకే దళితబంధు పథకం వర్తిస్తుందా అని ప్రశ్నించారు. అర్హులకు ఇవ్వకుండా వారి మద్దతుదారులకు ఇవ్వడం ఏమిటని అన్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చెప్పి నేటికీ అమలు చేయకపోవడం ఏమిటని, వెంటనే ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని నిరుద్యోగభృతి అందజేయాలని కోరారు. రైతులకు ఏకకాలంలో లక్ష రుణమాఫీ చేపట్టాలని రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య మధ్యతరగతి ప్రజలను నడ్డి విరిచేందుకు ధరలు పెంచిందని ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలను నట్టేట ముంచి నిత్యవసరాల సరుకులు, గ్యాస్ ధరలు ఆకాశానికి అంటాయని అన్నారు. గ్రామంలో ఉపాధి పనిచేసిన కూలీలకు డబ్బులు ఈ ప్రభుత్వం ఇవ్వడం లేదు అని మహిళలు చెప్తున్నారు. బడుగు, బలహీన వర్గాలకోసం ఎమ్మెల్యే చేసింది ఏమి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కదర్ల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ గోపాగాని సారయ్యగౌడ్, కొత్తపల్లి సర్పంచ్ శిలారపు సత్యం, కట్కూరి సుధాకర్ రెడ్డి, అరె సంతోశ్, పేరుక సంతోశ్, కరెంగుల రమేశ్, బొంకురి అవినాశ్, ఆర్కుటి సంతోష్ యాదవ్, ఎంచర్ల తిరుమలేశ్, ఎండీ షుకూర్, కలెవెన సంపత్, కెక్కర్ల సతీశ్, సతీశ్ దొబ్బతి అనిల్ గన్నామనేని తిరుపతిరావు, మేకల పోచాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతి

పాలకుర్తి(రామగుండం): పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పెరుమాండ్ల రాజేశ్(45) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేసే రాజేష్ గత వారం రోజుల క్రితం పెద్దపల్లి– మంథని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. రాజేశ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. కరీంనగర్‌లోని ఓప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా వారంరోజుల పాటు చికిత్స పొందిన రాజేష్ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య కీర్తి ఉన్నారు.

రైలునుంచి పడి మృతి చెందిన వ్యక్తి గుర్తింపు

జమ్మికుంట: రైలు నుంచిపడి మృతి చెందిన వ్యక్తిని రామగుండం రైల్వే పోలీసులు మంగళవారం గుర్తించారు.హెడ్ కానిస్టేబుల్ జి.తిరుపతి వివరాల ప్రకారం.. జమ్మికుంట, బిజిగిరిషరీఫ్ రైల్వేస్టేషన్ల మధ్య ట్రాక్‌పై శనివారం మృతదేహం లభ్యమైంది. దాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచారు. మృతుడు మంచిర్యాల పట్టణంలోని హమాలీవాడకు చెందిన ఎర్రు రవీందర్(30)గా గుర్తించారు. మంచిర్యాలలో రైలు ఎక్కి యాదగిరిగుట్ట దర్శనానికి వెళ్తుండగా ప్రమదవశాత్తు జారిపడి చనిపోయాడని భావిస్తూ.. మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మంచిర్యాల సభను జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: ఈనెల 14న మంచిర్యాల జిల్లాలో జరిగే కాంగ్రెస్ పార్టీ మహాసభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కోరారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. సాయంత్రం నాలుగు గంటలకు నస్పూర్‌లో సభ ఉంటుందని, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, అగ్రనాయకులు హాజరవుతున్నారని, కార్మికులు, ప్రజలు, రైతులు, నిరుద్యోగులు, ప్రజాసంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు. ఆయన వెంట నర్సింహారెడ్డి, ధర్మపురి, గుమ్మడి కుమారస్వామి, లక్ష్మిపతిగౌడ్, టైసన్ శ్రీను, సదానందం తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమన్న భానుడు

- 40.2 డిగ్రీలకు ఉష్ణోగ్రత
- బెంబేలెత్తుతున్న ప్రజలు

జ్యోతినగర్: భానుడు భగ్గుమన్నాడు. మంగళవారం గరిష్ట ఉష్ణోగ్రతలు 40.2డిగ్రీలకు చేరింది. ఉదయం ఏడు గంటల నుంచే నిప్పుల కుంపటిని తలపించింది. మధ్యాహ్నం సమయంలో ప్రజలు బయటకు రావడానికి సాహసించలేదు. పెరుగుతున్న ఎండలు, ఉక్కపోతకు ప్రజలు అల్లాడుతున్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుంటే వడదెబ్బ బారిన పడే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మంచినీరే బాగా తాగాలి

వేసవిలో మంచినీరు ఎక్కువగా తాగడం ఉత్తమం. ఎంతలా నీళ్ల తాగితే అంత మంచిది. వేసవితాపానికి శరీరంలో నీరు చమట రూపంలో బయటకు వెళ్లిపోతాయి. వృద్ధులు, గర్భిణులు ప్రతి అరగంటకోసారి నీళ్ల తాగాలి. మజ్జిగ, నిమ్మరసం తరుచూ తీసుకుంటే మంచిది. కర్బూజా, దోస, ఆరెంజ్, కొబ్బరి నీళ్ల తీసుకోవడం ఉత్తమం. పిల్లల విషయంలో తల్లిదండ్రులే జాగ్రత్త తీసుకోవాలంటున్న వైద్యులు. కొబ్బరినీరు, గ్లూకోజ్ తాగేలా చూడాలి.

అప్రమత్తంగా ఉండాలి..



షుగర్, జీర్ణకోశ వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచనలు పాటించాలి. ఎండ తీవ్రతకు శరీరంలోని నీరు చెమటరూపంలో బయటకు వస్తుంది. నీరు ఎక్కువగా తాగాలి. చిన్న పిల్లలు, గర్భిణులు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలి. ద్రవ పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పండ్ల జ్యూస్‌లు, కర్బూజా, దోసకాయలు తినాలి.

– డాక్టర్ ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌వో